
సాక్షి
ఒడిశా
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాల కవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 4,63,593లు, బంగారం 270 మిల్లీగ్రాములు, వెండి 20.82 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ఫైలేరియా నివారణకు చర్యలు

- 8లో



ఆధునికతతో అధిక లాభాలు

- 8లో

న్యూస్‌రీల్

అటవీ భూమి పట్టాలు పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సాహు

రాయగడ: జిల్లాలోని రామనగుడ తహసీల్ పరిధి సికిల, బ్రుతింగో, గురుండ గ్రామాలకు చెందిన 34మంది పేదలకు అటవీ భూమి పట్టాలను తహసీల్దార్ నిర్మల్‌చంద్ర సాహు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రత్యేక కార్య క్రమంలో భాగంగా వారికి వీటిని అందజే శారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శరత్ ఆనంద్, సెక్షన్ అధికారి విశ్వనాథ్ మండల్, గొరొండ సర్కిల్ ఆర్ఐ అజిత్‌కుమార్ తదిత రులు పాల్గొన్నారు.

కల్యాణ సింగుపూర్‌లో డ్రోన్ సర్వే



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితిలో ప్రభుత్వ భూములకు సంబంధించిన డ్రోన్‌సర్వే పనులు ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ సుధాకర్ రైతా, అదనపు తహసీల్దార్ గణేష్ దొళాయి, ఆర్ఐ సత్యజిత్ దాస్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా ముందుగా సమితిలోని నారాయణపూర్ గ్రామంలో సర్వే నిర్వహించారు. ఆయా ప్రాంతంలోని అటవీ, రెవెన్యూ స్థలాలను గుర్తించిన అనంతరం వివరాలను నిక్షిప్తం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. 10రోజులు సర్వే చేపట్టి, ప్రభుత్వ, రెవెన్యూ స్థలాలను గుర్తిస్తామని వివరించారు.


గీతాంజలి పాఠశాలలలో వార్షిక క్రీడలు



పోటీలకు సిద్ధమైన విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక పట్టణంలోని శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల మైదానంలో గీతాంజలి పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో వార్షిక క్రీడోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.వేణుగోపాల్ పోటీలను ప్రారంభించారు. ఇందులో ఒకటి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల మధ్య క్రికెట్, ఖోఖో, రన్నింగ్, లాంగ్‌జంప్, కర్చీఫ్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలు జరిగాయి. పీఈటీలు కార్తీక్ రాజగురు, స్వరూప పట్నాయక్, శుభశ్రీ పాత్రొ, కె.కొండలరావు, కె.లక్ష్మి తదితరులు సహకరించారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం సాయంత్రం నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో స్థానిక రైల్వేస్టేషన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 30.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి గజపతి జిల్లా గొలిమారి ప్రాంతానికి చెందిన అక్షయ బిరా(21)ను అరెస్ట్ చేశారు. అలాటే జిల్లా పరిధి మునిగుడ బస్టాండ్ వద్ద బిహార్‌కు చెందిన మనోజ్‌రాయ్(25) వద్ద 11 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులను కోర్టులో శుక్రవారం హాజర పరిచామని ఎక్సైజ్ అధికారి అభిరాం బెహరా తెలిపారు. అలాగే మరో ముగ్గురు వ్యక్తుల నుంచి 100 లీటర్ల సారా, 1500లీర్ల బెల్లంఊట స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

సంరక్షణ చట్టాలపై అవగాహన

జయపురం: స్థానిక సమితి టంకువ గ్రామంలో జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టం, శిశురక్షణ చట్టాలపై అవగాహన శిబిరం శుక్రవారం నిర్వహించారు. జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత న్యాయమూర్తి సుమన్ జెనా పాల్గొన్నారు. భారత రాజ్యాంగం శిశు రక్షణకు ప్రత్యేక భద్రత కల్పించిందని తెలిపారు. 2012లో భారత ప్రభుత్వం మహిళల రక్షణ, సాధికారతకు పోక్సో చట్టాన్ని తీసుకు వచ్చిందని, ఆపద సమయంలో దీనిని వినియోగంచు కోవాలని సూచించారు.

నినాదం కాదు.. నిజం

- వివిధ రంగాల్లో సాధిస్తున్న విజయాలే మహిళా సాధికారతకు నిదర్శన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రమాదేవి మహిళా విశ్వవిద్యాలయం ద్వితీయ స్నాతకోత్సవానికి హాజరు
- క్రియా యోగా ప్రచారంలో జ్ఞానప్రభ మిషన్ పాత్రపై అభినందనలు



సామాజిక సేవతో డాక్టరేట్ సాధించిన వృద్ధురాలిని అభినందిస్తున్న రాష్ట్రపతి

భువనేశ్వర్: మహిళా సాధికారత.. నినాదం కాదు, వాస్తవమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. మహిళల్లో సామర్థ్యానికి లోటు లేదని, జీవితంలో విజయం సాధించడానికి కావల్సింది అంకిత భావంతో కూడిన నిరంతర ప్రయత్నం, ఆత్మ విశ్వాసమని స్పష్టంచేశారు. కళ, సాహిత్యం, సంగీతం, నృత్యం, క్రీడలు, సైన్స్ తదితర రంగాల్లో అతివలు ఊహాతీత విజయాలు సాధిస్తున్నారన్నారు. స్త్రీ, పురుష వ్యత్యాసాన్ని ప్రోత్సహించిన సామాజిక వ్యవస్థ కుప్పకూలి పోతుందని పేర్కొన్నారు. భువనేశ్వర్‌లోని రమాదేవి మహిళా విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన ద్వితీయ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం శరవేగంగా పుంజుకుంటోందని తెలిపారు. తొలిసారిగా మహిళా ఎంపీల సంఖ్య 100 దాటిందన్నారు. ప్రస్తుతం 115మంది మహిళా ఎంపీలు ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర మంత్రులు రోహిత్ పూజారి, అశోక్‌చంద్ర పండా, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అపరాజిత చౌదరి, ఎంపీ అపరాజిత షడంగి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సాదరంగా స్వాగతం పలికారు. భువనేశ్వర్‌లోని బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెకు కండువాతో సత్కరించారు.

వంటకాలను ఆస్వాదించ లేకపోయా..

ప్రసంగం మధ్యలో రాష్ట్రపతి భావోద్వేగానికి లోనయ్యారు. రమాదేవి మహిళా కళాశాల పూర్వ విద్యార్థిగా తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 'ఈ పుణ్యనేలకు ప్రణామం. గవర్నర్‌గా ఉన్న సమయంలో రెండుసార్లు రమాదేవి ప్రాంగణాన్ని సందర్శించాను. సుమారు 40–42 ఏళ్ల గత జీవితానికి రమాదేవి గోడలు మూగసాక్షిగా నాకు స్వాగతం పలుకుతున్నట్లు, గౌరవప్రదంగా తిరిగి వస్తున్నట్లు అనిపిస్తోంది. ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ నుంచి పేద రైతుల కూతుళ్ల వరకు కలిసి చదువుకున్న యూనివర్సిటీ ఇది. మాలో వివక్ష ఉండేది కాదు. మనస్సులో స్ఫూర్తిని ప్రేరేపించింది. కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. గిరిజన విద్యార్థుల హాస్టల్‌లో మెసిలాను. ఆర్థిక సమస్యల కారణంగా యూనివర్సిటీ క్యాంటీన్‌లో రుచికరమైన వంటకాలను ఆస్వాదించలేకపోయా'నని విద్యార్థి దశ స్మృతులను అందరితో పంచుకున్నారు. ప్రస్తుత తరం విద్యార్థులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నూతనోత్సాహం..

యూనివర్సిటీ క్యాంపస్ నుంచి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. ఒక్కసారిగా విద్యార్థుల వైపు అడుగులు వేశారు. వారి వద్దకు వెళ్లి, ఫొటోలు తీసుకోవడంతో అంతా అవాక్కయ్యారు. జీవితంలో ప్రతీది సాధ్యమేనని ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులను ఉత్సాహపరిచి ముందుకు సాగారు.

నలుగురికి గౌరవ డాక్టరేట్లు..

స్నాతకోత్సవం పురస్కరించుకుని నలుగురు ప్రముఖ మహిళలకు రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో సౌమ్య స్వామినాథన్‌కు డీఎస్సీ డిగ్రీ, సాహిత్యం–సామాజిక సేవలో పూర్ణమాసి జానీ, సామాజిక సేవ, మహిళా సాధికారత రంగంలో సునీత కృష్ణన్, కళలు–సాంస్కృతిక రంగంలో ఒడిస్సీ నృత్యకారిణి అరుణా మహంతికి డీ.లిట్ డిగ్రీ అందజేశారు. ఈ సందర్భంగా 22మంది ఉన్నత ఉత్తీర్ణులకు బంగారు పతకాలు బహూకరించారు. వీరిలో 15 మంది పీజీ(పోస్ట్ గ్రాడ్యుయేషన్) విభాగం ఉత్తమ విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు.



ఉత్తమ విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న దృశ్యం

యోగాయే మార్గం..

క్రియా యోగాను ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో జ్ఞానప్రభ మిషన్ క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని రాష్ట్రపతి అభినందించారు. నిస్సందేహంగా యోగా భారతదేశపు ప్రాచీన శాస్త్రం, ఆధ్యాత్మిక సాధన అని ప్రకటించారు. దీని లక్ష్యం ఆరోగ్యకరమైన మానవ సమాజాన్ని ఆవిష్కరించడమన్నారు. ఆరోగ్యవంతమైన జీవితానికి చికిత్స కంటే ముందస్తు నివారణ మేలని తెలిపారు. 'యోగ్–యుక్త్'(యోగంతో అనుబంధం)గా సాగితే 'రోగ్–ముక్త్'(రోగాల నుంచి విముక్తి) పొందవచ్చని అభివర్ణించారు. యోగా సాధనతో శరీరానికి ఆరోగ్యం, మనస్సుకు ప్రశాంతత సొంతం అవుతుందని ప్రోత్సహించారు. నేటి ప్రపంచంలో భౌతిక సంతోషం పొందడం అసాధ్యం కాదని, అయితే మనశ్శాంతి గగన కుసుమమై అందనంత ఎత్తులో ఊగిసలాడుతోందని చమత్కరించారు. ఈ పరిస్థితికి ఏకైక పరిష్కార మార్గం యోగా ఒక్కటే అని ప్రబోధించారు.



రమాదేవి మహిళా విశ్వ విద్యాలయం స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము



విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్ గణేషీలాల్, సీఎం నవీన్ పట్నాయక్

తల్లిదండ్రుల పట్ల శ్రద్ధ.. మానవ ధర్మం

భౌతిక అంచనాలు, ఆకాంక్షలతో మనిషి క్రమంగా ఆధ్యాత్మిక బాట తప్పి, ధార్మిక విలువల పరిరక్షణ పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయం వ్యక్తం చేశారు. తల్లి, తండ్రి, గురువు, అతిథిని దైవంగా భావించాలని భారతీయ రుషులు మనకు బోధించారు. ఈ బోధన వాస్తవ జీవితంలో పాటించాలని సూచించారు. ప్రేమ, అనురాగం, మమకారం, ఆత్మీయ భావాలను కాలరాసి, తల్లిదండ్రులను అమానుషంగా గాలికి వదిలేయగా మృతిచెందిన వారి చిత్ర పటాలకు మాలలు వేయడం సరికాదని హితవు పలికారు ఇటువంటి అకృత్యాలు ఎప్పుడూ ఆధ్యాత్మిక, ధార్మిక విలువలను కూడగట్టుకోలేవని స్పష్టంచేశారు. భువనేశ్వర్ లోని జ్ఞానప్రభ మిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలో పాల్గొన్న ఆమె.. పై విధంగా ప్రసంగించారు. పరిమిత వనరుల పరిరక్షణ దిశగా పరిమిత వనరులతో పుడమి తల్లి నిత్యం పులకించేలా మానవాళి జాగ్రత్త వహించాలని కోరారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్రపతి



జ్ఞానప్రభ మిసన్ వ్యవస్థాపక దినోత్సవానికి హాజరైన యోగా సాధకులు

ఒడిశా ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.పురంధేశ్వరి



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పురంధేశ్వరి

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ బలాన్ని నిరూపించాలని ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఒడిశా వ్యవహాల ఇన్‌చార్జి డి.పురంధేశ్వరి సూచించారు. ఒడిశా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, దీనిని బీజేపీ కార్యకర్తలు, నాయకులు సద్వినియోగించుకోవాలని తెలిపారు. నగరంలోని సర్క్యూట్ హౌస్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి, బరంపురం, అస్కా లోక్‌సభ పరిధిలోని నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నవీన్ పట్నాయక్ సారథ్యంలోని గత 22 ఏళ్ల బీజేడీ పాలనలో చోటు చేసుకున్న అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికార మార్పు తథ్యమని జోష్యం చెపఆరు. దీనికి అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. సీఎం నవీన్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో వివిధ పథకాల్లో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని ఆరోపించారు. ప్రజలకు ఈ వాస్తవాలు తెలియజేయాలని వివరించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు బృగుబక్షిపాత్రొ, జిల్లా అధ్యక్షుడు కన్ను చరణ్‌పతి, నాయకులు పాల్గొన్నారు.

గోవిందపల్లిలో బీఎస్ఎఫ్ శిబిరం



చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖొయిర్‌పుట్ సమితి గోవిందపల్లి పంచాయతీ కుసుమ్‌పుట్ గ్రామం వద్ద 155 బెటాలియన్ బీఎస్ఎఫ్ జవాన్లు శుక్రవారం జనసంపర్క్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు దుస్తులు, నిత్యావసర సరుకులు, యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు, చిన్నారులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఇకప్పుడు మావోయిస్టుల భయంతో ఉన్న గ్రామస్తులు జవాన్ల రాకతో ప్రశాంత జీవనాన్ని పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ బీఎస్ నేగీ, జవాన్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి ఉత్సవం



మెయిన్ రోడ్డులో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

- బరంపురలో వీరబ్రహ్మేంద్ర స్వామి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

బరంపురం: నగరంలోని డైమండ్ ట్యాంక్ రోడ్డు ప్రాంగణంలో ఉన్న పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 53వ వార్షిక నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 7.12 గంటలకు గణపతి పూజ, ధ్వజారోహణం చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో తిరువీధిల్లో మేలతాళాలు, సంప్రదాయ కొళకుంజుల నృత్యాలతో భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. అడుగడుగునా స్వామివారికి మహిళలు నైవేద్యాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారి ఊరేగింపు ఉత్సవాల్లో వందలాది మంది తెలుగు ప్రజలు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలాపన, భజన కార్యక్రమాలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు ఈనెల 18 వరకు జరగనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

స్టాండింగ్ కమిటీ సమీక్ష



స్పాట్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న అరవింద డాలీ

- హాజరైన కమిటీ చైర్మన్ అరవింద డాలీ

పర్లాకిమిడి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు సత్యనారాయణ ప్రధాన్ వాపోయారు. గత మూడేళ్లుగా రవాణా, గోనె సంచులు, కాటా చార్జీలు సైతం అందించడం లేదని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ, సామాజిక సంక్షేమశాఖ అధికారులతో స్టాండింగ్ కమిటీ సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. స్టాండింగ్ కమిటీ చైర్మన్ అరవింద డాలీ(భువనేశ్వర్), రణపూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రధాన్, మోహానా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో తదితరులు హాజరయ్యారు. పర్లాకిమిడి, సిద్ధమణుగు తదితర ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గోదాంలను సందర్శించారు. జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు మాట్లాడుతూ మండీల వద్ద ధాన్యం కొనుగోళ్ల వ్యవధి, సేకరణ లక్ష్యాలను పెంచాలని కోరారు. పౌరసరఫరాల శాఖ, సొసైటీలు మధ్య సమన్వయం లేకపోవడంతో మొక్కజొన్న, చోడి పంట రైతులకు మద్దతు ధర అందడం లేదన్నారు. అనంతరం అధికారులు పర్లాకిమిడి గజపతి స్టేడియంలో కిన్నెరులు నిర్వహిస్తున్న టెర్రకోటా చేతివృత్తుల శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి ప్రఫుల్ల కుమార్ బెహరా, ఏఆర్‌సీఎస్ నాయక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మేజిస్ట్రేటు సంగ్రాంశేఖర పండా, ఏడీఎం(రెవెన్యూ) ప్రదీప్‌కుమార్ నాయక్, జిల్లా సంక్షేమశాఖ అధకారి సంతోష్‌కుమార్ రథో, డీఎస్పీ వామదేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కిన్నెరులు తయారుచేసిన హస్తకళలను పరిశీలిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు

పట్టుబడిన గొలుసు దొంగలు

- రాయగడలో వరుస చోరీ కేసులను ఛేదించిన పోలీసులు
- 49 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మల్లిక్, వెనుక నిందితులు

రాయగడ: గత కొద్ది రోజులుగా పట్టణంలో చోటు చేసుకున్న వరుస గొలుసు దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 49గ్రాముల బంగారం, 2 ద్విచక్ర వాహనాలు, 5 సెల్‌ఫోన్లు, రూ.48 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సుధాం మల్లిక్, సదర్ పోలీస్ స్టేషన్ ఐఐసీ రస్మిరంజన్ ప్రధాన్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో జిల్లాలోని లక్ష్మీపూర్ సమితి మండులగుడ గ్రామానికి చెందిన సుదర్శన్ కంధపాణి(24), కల్యాణ సింగుపూర్ సమితి అడాబడి గ్రామానికి చెందిన యుధిష్ఠర్ కౌసల్య(24), రాయగడలోని పయికోవీధికి చెందిన బండి శంకరరావు(58), కాసీపూర్‌కు చెందిన శంకర్‌నాయక్(21), ఆంధ్రప్రదేశ్ మన్యం జిల్లా పార్వతీపురంలోని మక్కువకు చెందిన పి.సూర్యనారాయణ(29), టికిరి సమితిలోని మధు ఖొరా(29) ఉన్నట్లు గుర్తించారు. ఫిబ్రవరి ఒకటిన రాయగడ ఆర్‌కే నగర్‌లో నివాసముంటున్న వృద్ధురాలు సంజుక్త బక్షిపాత్రొ జగన్నాథ మందిరానికి వెళ్లి వస్తుండగా ట్రెజరీ కార్యాలయం సమీపంలో బైకుపై వచ్చిన దుండగులు ఆమె మెడలోని 36 గ్రాముల బంగారు గొలుసును అపహరించారు. దీనిపై బాధితురాలి కుమారుడు గొపరంజన్ బక్షిపాత్రొ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఫిబ్రవరి 6న ఇందిరానగర్‌కు చెందిన వి.తిరుపతి రాజు మెడలోని చైన్‌ను తెంపుకెళ్లారు. దీనితో పాటు 2022 జూలై 16న రాయగడ సాయిప్రియ నగర్‌లో గొలుసు దొంగతనం కేసుకు సంబంధించి చేపట్టిన దర్యాప్తులో నిందితులంతా ఒకే ముఠాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి, 49గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని ఐఐసీ రస్మిరంజన్ ప్రధాన్ సమోంలో బాధితులకు అందజేశారు.



బాధితుడు బక్షిపాత్రొకు చోరీ సొత్తును అందిస్తున్న ఐఐసీ ప్రధాన్

క్లుప్తంగా

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నళినీ

రాయగడ: పట్టణంలోని రైతుల కాలనీలో నవజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30మంది ఆదివాసీ వృద్ధ మహిళలకు నిత్యావసర సరుకులను ట్రస్ట్ నిర్వాహకురాలు ఎం.నళినీ శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతి నెలా బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాల దుంపలు తదితర సరుకులు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

రాష్ట్ర పోటీలకు గొట్లాం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు అర్హత సాధించినట్టు స్కూల్ హెచ్.ఎం శ్రీరామాచారి, పీడీ యూఎస్ సత్యానంద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ఇటీవల జరిగిన శాఫ్ ఆధ్వర్యంలో అండర్ 21 బాలురు విభాగంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. జిల్లా తరపున పోటీల్లో తమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొనగా నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. స్కూల్‌కు చెందిన కె.సందీప్, బి.హరి, ఎల్.విజయదుర్గ, ఎస్.భారతి అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ నెల 11 నుండి 13 వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



చికిత్స పొందుతున్న హరికృష్ణ

పార్వతీపురం: ట్రాక్టర్‌ను వెనుక నుండి లారీ ఢీకొనడంతో గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... పార్వతీపురం నుండి కొమరాడ మండలం గంగరేగువలస గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్తుండగా ఆర్టీఓ కార్యాలయం సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ హరికృష్ణ తలకు తీవ్ర గాయమైంది. ఈ మేరకు ప్రైవేటు వాహనం ద్వారా క్షతగాత్రుడును పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు హరికృష్ణకు వైద్యులు చికిత్సను అందించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

విజయనగరం క్రైమ్: స్థానిక కార్పొరేషన్ పరిధిలో 28వ వార్డు సచివాలయం సమీపంలో ఉన్న పరపతి వీధిలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఒక లగేజీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.41వేల 154ల విలువ కలిగిన 1083 కిలోల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం పట్టుకున్నారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న పిట్ట రమణ, బియ్యాన్ని సేకరించిన బండారు ఎల్లాజీపై కేసులు నమోదు చేసి బియ్యంతో పాటూ వాహనాన్ని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దాడుల్లో కానిస్టేబుల్ పురుషోత్తం, పౌర సంబంధాల శాఖ అధికారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

13న అప్రంటీస్ మేళా

విజయనగరం రూరల్: ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 13న అప్రంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.గోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ఉదయం 9 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రంటీస్ షిప్ (పీఎంఎన్ఏఎం) మేళా నిర్వహించడం జరుగుతుందని, ఈ మేళాకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. వివిధ ట్రేడ్లలో ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ అప్రంటీస్ మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫైలేరియా నివారణకు చర్యలు

- 367 గ్రామాల్లో ఔషధ సేవన కార్యక్రమానికి శ్రీకారం
- కె.మల్లిగాంలో ప్రారంభించిన కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్



ఫైలేరియాపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్



కార్యక్రమానికి హాజరైన పాఠశాల విద్యార్థులు



ఫైలేరియా ఔషధాన్ని సేవిస్తున్న విద్యార్థిని

రాయగడ: జిల్లాలో ఫైలేరియా నివారణ చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి సమీపంలోని కె.మల్లిగాం గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఔషధ సేవన కార్యక్రమాన్ని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ శుక్రవారం ప్రారంభించారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ పృష్టి, జిమిడిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ సుబుద్ధి, డాక్టర్ సస్మిత ఆచార్య, సంజుక్త బెహరా, కిషోర్ పట్నాయక్, జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు ఫైలేరియా నివారణ ఔషధాలను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బిసంకటక్, జగన్నాథపురం, గుడారి ప్రాంతాల్లో మొదటి విడత కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. మొత్తం 367 గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, రెండేళ్లు పైబడిన వారందరికి ఈ ఔషధాలను పంపిణీ చేసేందుకు సన్నహాలు చేస్తున్నామని వెల్లడించారు. ఈనెల 19నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసేలా కార్యచరణ సిద్ధం చేశామన్నారు. సీడీఎంఓ మాట్లాడుతూ వ్యాధి బారిన ఇంకెవ్వరూ పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎండీఏ) పేరిట జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమం విజయవంతమ్యేందుకు అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తల పాత్ర చాలా ముఖ్యమైనదని తెలిపారు. ప్రతి గ్రామంలో పర్యటించి, ఔషధాలను అందరికీ అందేవిధంగా బాధ్యత వహించాలని సూచించారు. అనంతరం ఫైలేరియా వ్యాధి సంక్రమించే తీరు, దాని నివారణకు సంబంధించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు.

ఆధునికతతో అధిక లాభాలు

- పర్లాకిమిడిలో జిల్లాస్థాయి వ్యవసాయ యంత్రాల మేళా
- ప్రారంభించిన ఎమ్మెల్యే గమాంగో, జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు



వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాశరథి గమాంగో, జిల్లా అధికారులు



అతి తక్కువ ఖర్చుతో తయారు చేసిన ట్యూబ్ వెల్ పనితీరును పరిశీలిస్తున్న దృశ్యం



సెంచూరియన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్

పర్లాకిమిడి: వ్యవసాయంలో ఆధునిక, సాంకేతిక విధానాలు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మోహానా ఎమ్మెల్యే దాశరథి గమాంగో సూచించారు. గజపతి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పర్లాకిమిడి గజపతి స్టేడియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ పనిముట్లు, యంత్రాల మేళాను జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలాశెఠి తదితరులు పరిశీలించారు. రాష్ట్రప్రభుత్వం సబ్సిడీ విధానంలో రైతులకు ధాన్యం నూర్పిడి, కలుపుతీత, చిన్నతరహా పిండిమిల్లులు, ట్రాక్టర్లు, క్రషర్, విత్తనాలు, ఎరువులు, పిచికారీ యంత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు వీటిని వినియోగించుకొని, కూలీల కొరతను అధిగమించాలని సూచించారు. సమావేశంలో ఏడీఎం సంగ్రాంశేఖర పండా, గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండల్, గైబ జెడ్పీటీసీ రేణుకా పాత్రో, జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి కైలాష్‌చంద్ర బెహరా ప్రముఖులు పాల్గొన్నారు. ప్రదర్శన మేళా ఈనెల 13వరకు కొనసాగనుందని అధికారులు తెలిపారు.

క్రీడా రంగం అభివృద్ధికి పెద్దపీట

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని రంగాలతో పాటు క్రీడారంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ పేర్కొన్నారు. మండలంలోని చెల్లూరు లెప్రసీ మిషన్ ఒకేషనల్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఈశ్వర్ కౌశిక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని తెలిపారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులు పోటీల్లో జిల్లాతో పాటు రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఈశ్వర్‌కౌశిక్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హెన్నా దినకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కట్నం ఇవ్వలేదని దాడి



చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు

పార్వతీపురం: పట్టణంలోని బంధం వారి వీధిలో స్కూటీపై మార్కెట్‌కు వెళ్తున్న కుర్మాన అన్నపూర్ణ, సురేష్‌కుమార్‌పై స్టీల్ రాడ్లతో అల్లుడు జి.ప్రతాప్, బాలు, ప్రమోద్‌లు శుక్రవారం దాడి చేశారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రతాప్ కట్నం ఇవ్వలేదని అన్నపూర్ణ, సురేష్‌లపై స్టీల్‌రాడ్‌తో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రైవేటు వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడితో పోలీసులు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలో నవదుర్గ అమ్మవారి ఆలయం వద్ద బాలుడు తప్పిపోయి సుమారు గంట కాలం పాటు పోలీసులు, తల్లిదండ్రులకు కంగారెత్తించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. రేగిడి మండలం పెదకోడిశ గ్రామానికి చెందిన కొండేటి శంకరరావు, ఆదిలక్ష్మి దంపతులు తమ కుమారుడు జీవన్‌కుమార్‌ను అమ్మవారి ఆలయానికి శుక్రవారం అక్షరాభ్యాసానికి తీసుకువచ్చారు. అక్షరాభ్యాసం హడావుడిలో తల్లిదండ్రులు ఉన్న సమయంలో బాలుడు గుడి బయటకు వచ్చాడు. బాలునికి తల్లిదండ్రులు కనిపించకపోవడంతో ఏడ్చుకుంటూ వెళుతుండగా స్థానికులు గమనించి మెయిన్ రోడ్డుపై ఉన్న పోలీసులకు సమాచారం అందించారు. వారు బాలుడిని దగ్గరకు తీసుకుని తల్లిదండ్రులను వెతికే పనిలో నిమగ్నమయ్యారు. ఇంతలో బాలుని తల్లిదండ్రులు కూడా తమ కుమారుడు కనిపించడం లేదంటూ కంగారు పడుతూ వెతుకులాట ప్రారంభించారు. అంబేద్కర్ జంక్షన్‌లో బాలుడుని చూసి దగ్గరకు వెళ్లిన తల్లిదండ్రులను పోలీసులు ఆరా తీశారు. తమ కుమారుడుగా నిర్ధారించుకుని అప్పగించారు. తమ కుమారుడిని అప్పగించిన పోలీసులకు బాలుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: ఆటోను ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన రెడ్డి రమాదేవి, ఎన్.గౌరీశ్వరీ, జి.అప్పలనరసమ్మ, జి.పార్వతమ్మ పార్వతీపురం మండలం ఎమ్మార్‌నగరం బంధువుల పరామర్శకు వెళ్లారు. తిరిగి పార్వతీపురం నుండి కన్నపుదొరవలస వెళ్తున్న సమయంలో నందివానివలస, గిజబ గ్రామాల మధ్య వున్న ఎల్లమ్మ తల్లి గుడి సమీపంలో నీలకంఠాపురం నుండి పార్వతీపురం వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో వున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు చినమేరంగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. మరింత మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్ ద్వారా తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల.. ఆహ్వాన నాటిక పోటీలకు ఏర్పాట్లు పూర్తి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్ తదితరులు

విజయనగరం టౌన్: నాటక శాల, అభినయ నటరత్న నాటక పరిషత్ ఆధ్వర్యంలో 7వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఈ నెల 11, 12, 13 తేదీల్లో గురజాడ కళాభారతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక శివాలయం వీధిలో ఉన్న కార్యాలయం ఆవరణలో నాటిక పోటీల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల పాటూ నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా 11న శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సభా కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం నిర్వహించే నాటిక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి నిర్వహించే ''చీకటి పువ్వు' అనంతరం నాటకశాల నట సేవా సమాజం, విజయనగరం ఆధ్వర్యంలో 'మహర్షి' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 12న ఆదివారం నిర్వహించే సభా కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం పల్నాడు జిల్లా చిలకలూరిపేట అంజనా రాథోడ్ థియేటర్ ఆధ్వర్యంలో 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక, అనంతరం గుంటూరు సద్గురు కళానిలయం నిర్వహించే 'కమనీయం' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 13న ముగింపు ఉత్సవంలో అనకాపల్లి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం పల్నాడు జిల్లాకు చెందిన మద్దుకూరి క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'మృత్యువ్రతం' నాటిక, గుంటూరు జిల్లా కట్రపాడు ఉషోదయా కళానికేతన్ ఆధ్వర్యంలో 'ప్రక్షాళన' నాటిక ఉంటుందన్నారు. అనంతరం ఎన్టీఆర్ విశిష్ట పురస్కారాన్ని తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రానికి చెందిన బుద్దాల వెంకట రామారావుకు ఎన్టీఆర్ విశిష్ట పురస్కారం అందజేస్తారన్నారు. వాటితో పాటూ నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. కళాభిమానులందరూ పాల్గొని తరించాలని కోరారు. కార్యక్రమంలో మెయిదకి చెందిన సినీ డైరెక్టర్, రైటర్ ఇజ్జరోతు శ్రీముత్యం తదితరులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేద్దాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న స్వాయి

- ఆప్ జిల్లా అధ్యక్షుడు జనమేజయ్ స్వాయి

రాయగడ: గెలుపోటములు పక్కన పెట్టి, ప్రజల ఆదరణ పొందేలా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంతా కలసికట్టుగా కృషి చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు జనమేజయ్ స్వాయి పిలుపునిచ్చారు. పట్టణంలోని రాణిగుడ ఫారంలో ఉన్న పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేలా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి ప్రాంతంలో పార్టీ ఉనికి చాటేలా జెండాలు, కరపత్రాలు, పోస్టర్లు అతికించాలని పేర్కొన్నారు. అలాగే మార్చి ఒకటిన జరగనున్న జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశంలో అంతా పాల్గొవాలని కోరారు. సమావేశంలో ఆప్ మహిళా విభాగం జిల్లాశాఖ అధ్యక్షురాలు సుచిత్ర పాయికొరాయ్, నాయకులు జితేంద్ర సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం ప్రకటనపై హర్షం



జనకల్యాణ మంచ్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

జయపురం: పట్టణంలోని స్వయంపాలిత విక్రమదేవ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా ప్రకటించిన సీఎం నవీన్ పట్నాయక్‌కు జయపురం జనకల్యాణ మంచ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంచ్ నిర్వాహకులు రాజేంద్రకుమార్ గౌఢ అధ్యక్షతన గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో ప్రముఖ న్యాయవాది మదనమోహన నాయక్ మాట్లాడుతూ కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించడం వల్ల అవిభక్త కొరాపుట్ ప్రజల చిరకాల కోరిక నేరవేందన్నారు. బీజేడీ నాయకులు బాలారాయ్ మాట్లాడుతూ కొరాపుట్ జిల్లాను క్షేత్రస్థాయి నుంచి అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారన్నారు. ఇందులో భాగంగా విక్రమదేవ్ కళాశాల ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం నవీన్ జిల్లాలో అనేక అభివృద్ధి పథకాలకు శంఖుస్థాపన చేశారని గుర్తుచేశారు. సమావేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు దేవేంద్ర బాహిణీపతి, పరమేశ్వర పాత్రో తదితరులు విశ్వవిద్యాలయం ప్రకటనపై హర్షం వ్యక్తంచేశారు. సమావేశంలో కృష్ణచంద్ర హొత్తా, అభిరాం నాయక్, ప్రఫుల్ల దాస్, ప్రదీప్ నాయక్, అనీల్‌మిశ్రా, నరేష్ మహకూల్, రామప్రసాద్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

బొద్దాం పాఠశాల ఆకస్మిక తనిఖీ



బొద్దాం పాఠశాలలో విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులన్నీ కలియతిరిగి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అడిగి తెలుసుకుని హాజరు పట్టి పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ఫార్మెటివ్ ఎసెస్‌మెంట్ – 3 పరీక్షలకు విద్యార్థులు హాజరు శాతం తక్కువగా ఉండడానికి కారణమేమిటని హెచ్‌ఎం గురుమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల వాతావరణం బాగోలేదని తెలిపారు. విద్యార్థుల గ్రేడింగ్ కూడా అంతంతమాత్రమేనని, పరీక్షల సమయంలో విద్యార్థులు హాజరుశాతం తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యాప్రమాణాలు మెరుగుపర్చకపోతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధ్వాన్నంగా ఉన్న పాఠశాల పరిస్థితులు, విద్యార్థుల గ్రేడింగ్‌కు సంబంధించి హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు ఇవ్వనున్నామని అన్నారు. ఆయనతో పాటు ఎంఈఓ పి.నాగయ్య తదితరులు ఉన్నారు.

ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా అప్పారావు



ఆర్టీసీ స్టేట్ చైర్మన్ మల్లిఖార్జునరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అప్పారావు

విజయనగరం టౌన్: ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోనల్ వర్కుషాపులో పని చేస్తున్న డి.అప్పారావు వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కమిటీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్యలు ఎంపికలో పాల్గొన్నారన్నారు. ఈ మేరకు ఆర్టీసీ స్టేట్ చైర్మన్ మల్లిఖార్జునరెడ్డిని ఆయన చాంబర్‌లో కలిశామన్నారు. ఆర్టీసీని ప్రభుత్వం విలీనం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రికి తామంతా రుణపడి ఉన్నామన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి వైఎస్సార్ అసోసియేషన్ కట్టుబడి ఉందన్నారు. అప్పారావు ఎంపిక పట్ల జోనల్ వర్క్‌షాపు, డిపో పరిధిలో ఉన్న వైఎస్సార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

పైడితల్లి అమ్మవారి ఆలయ అధికారి సస్పెన్షన్

విజయనగరం టౌన్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినందుకుగానూ ఆలయంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న పెనుమత్స శ్రీనివాసరాజును సస్పెన్షన్ చేసినట్లు ఆలయ ఈఓ. కిశోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ, విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో మెమోలు జారీ చేసినప్పటికీ అదే ధోరణితో ఉండడంతో సస్పెన్షన్ చేసినట్లు స్పష్టం చేశారు. అదే విధంగా వనంగుడి ఆవరణ చుట్టూ పెన్సింగ్ వేసేందుకు అంచనా వేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు జిల్లా జట్టు పయనం



పోటీలకు బయలుదేరిన జిల్లా జట్టు

పాతపట్నం : కడప జిల్లా కేంద్రంలోని మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు శుక్రవారం శ్రీకాకుళం జట్టు బయలుదేరి వెళ్లిందని జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అధ్యక్షుడు గురాడి అప్పన్న తెలిపారు. క్రీడాకారులకు పాతపట్నానికి చెందిన పారిశ్రామికవేత్త సిరిపురం తేజేశ్వరరావు స్పోర్ట్స్ డ్రెస్‌లతో పాటు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పీడీలు వై.శేఖర్‌బాబు, జె.కృష్ణ, డి.లక్ష్మీనారాయణ, జె.శ్రీను, సుజాత, లోకేష్ పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారుకు గాయాలు

మందస: మండలంలోని హరిపురం కోనెల చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల్లో వేతనదారు తిరుమరెడ్డి కమలకు తీవ్ర గాయాలయ్యాయి. చెరువు పనుల్లో భాగంగా చెత్తా, చెదారానికి నిప్పు పెట్టగా మంటలు చెలరేగాయి. అటువైపుగా వెళ్తున్న కమలకు మంటల వేడి తగలడంతో శరీరానికి గాయాలయ్యాయి. వెంటనే ఆమెను హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఏపీఓ బి.వి.హరికృష్ణ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కొనసాగుతున్న హత్యకేసు దర్యాప్తు

కోటబొమ్మాళి: మండలంలోని లఖందిడ్డి పంచాయతీ మూలపేటలో బుధవారం రాత్రి జరిగిన మట్ట గవరయ్య హత్య కేసు దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ శుక్రవారం మూలపేట వెళ్లి పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. మృతుని కాల్ డేటా పరిశీలించగా కీలక సమాచారం బయటపడినట్లు తెలిసింది. ఇప్పటికే పోలీసుల అధీనంలో నిందితుడు ఉన్నట్లు సమాచారం. కేసు విచారణ చివరి దశలో ఉందని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

భారీగా ఒడిశా మద్యం పట్టివేత



ఎస్ఈబీ సిబ్బంది అదుపులో మద్యం సీసాలు, ద్విచక్ర వాహనాలు

ఇచ్ఛాపురం రూరల్ / ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ రాజులునాయుడు తెలిపారు. ఇచ్ఛాపురం మండలం బూర్జపాడుకు చెందిన శివంగి మాధవరావు నాటుసారాను అమ్ముతుండగా అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. అదే విధంగా కవిటి మండలం కొజ్జిరియా గ్రామానికి చెందిన దుంగి వెంకటరమణ, బడియా వెంకటరావులు చీకటి బలరాంపురం నుంచి రెండు ద్విచక్ర వాహనాలపై సుమారు రూ.20వేలు విలువైన ఐదు టిన్ బీర్ బాక్సులు తీసుకువెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా సుమండి నుంచి మందసకు చెందిన సాయికుమార్ బెహరా, పలాస మండలం సున్నాడకు చెందిన కుమ్మరి కామరాజులు ద్విచక్రవాహనంపై 24 స్ట్రాంగ్‌బీర్లు, 43 ఓసీ మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పాత టోల్‌ప్లాజా వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. మూడు ద్విచక్ర వాహనాలతో పాటు ఐదుగురిని అదుపులోకి తీసుకొని పలాస మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సీఐ రాజులునాయుడు, ఎస్ఐలు ఎస్.గురుమూర్తి, ఎస్.ముసలినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమశాఖలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు, మినీ అంగన్‌వాడీలకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ శాఖ ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖలో 27 అంగన్‌వాడీ కార్యకర్తలు, 94 అంగన్‌వాడీ ఆయాలు, మరో 22 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు కలిపి మొత్తం 130 పోస్టుల భర్తీకి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 11వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. నిర్దేశిత ప్రభుత్వ మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, రోస్టర్ పాయింట్ల ప్రకారం పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు

- వైఎస్సార్ బీమాలో నమోదైనప్పటికీ గుర్తింపు కార్డు తప్పనిసరి
- కార్మిక శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



కార్మికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టెక్కలి: అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సైతం అండగా నిలిచింది. కార్మిక శాఖ ఆధ్వర్యంలో వారికి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంది. అయితే కొంతమంది భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమాలో నమోదై ఉన్నప్పటికీ.. కార్మికులుగా గుర్తింపు కాలేదు. ఇలాంటి వారిపై కార్మిక శాఖ అధికా రులు ప్రత్యేక దృష్టి సారించారు. గుర్తింపు కార్డులు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో వైఎస్సార్ బీమాలో నమోదైన భవన నిర్మాణ కార్మికుల వివరాలను సేకరిస్తూ.. గుర్తింపు కార్డు పొందేలా అవగాహన కల్పిస్తున్నారు.

1,66,836 మంది గుర్తింపు

జిల్లాలో కార్మిక శాఖ రికార్డుల్లో 1,66,836 మంది భవన నిర్మాణ కార్మికులుగా నమోదై ఉన్నారు. అయితే వైఎస్సార్ బీమాలో మాత్రం 1,83,292 మంది పేర్లు నమోదయ్యాయి. వీరందరినీ కార్మిక శాఖ పరిధిలో భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేసి సంక్షేమ పథకాలు అందజేసేందుకు గ్రామ సచివాలయాల్లో వివరాలు సేకరిస్తున్నారు.

గుర్తింపు కార్డులకు అర్హులు వీరే..

భవన నిర్మాణ కార్మికుడిగా గుర్తింపు కార్డు పొందడానికి వివిధ పనులు చేసే వారికి అవకాశం ప్రభుత్వం కల్పించింది. వీరిలో మట్టిపనివారు, పునాది గుంతలు తీసేవారు, చదునుచేసేవారు, తాపీమేస్త్రిలు, తాపీకూలీలు, రాడ్ బెండింగ్, కార్పెంటర్లు, పెయింటర్లు, సెంట్రింగ్ పనివారు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్స్, బండలు పరిచేవారు (నాపరాయి, మార్బుల్, గ్రానైట్, టైల్స్ మొదలగువారు), పాలిష్ పనివారు, సీలింగ్ వర్కర్స్ (పీవోపీ) షోకేష్ పనివారు, కంకర ముఠా కార్మికులు, రోడ్డు నిర్మాణ పనివారు, రోలర్ డ్రైవర్లు, జేసీబీ, బుల్డోజర్, క్రేన్ ఆపరేటర్లు, నిర్మాణ రంగంలోని సూపర్‌వైజర్లు, క్లర్కులు, అకౌంటెంట్లు, పాతభవనములు పగలగొట్టేవారు, డెబ్రిస్‌ను వాహనాల ద్వారా పారబోసే కార్మికులు, ఇటుకలు తయారుచేసేవారు, క్వారీ కార్మికులు, బావులు, చెరువులు తవ్వడం, పూడికతీయడం, బోరుగుంతల పనిచేసేవారు, రోలింగ్ షట్టర్ పనివారు, ఐరన్ గ్రిల్స్, డోర్లు, వెల్డింగ్ పనివారు, గ్లాస్, వుడ్ పార్టీషియన్ వర్కర్స్, వుడ్ కార్వింగ్, చిత్రిక పనివారు, ఎలివేషన్ వర్కర్స్, సిమెంట్ వరలు, సిమెంట్ ఇటుకలు, పోల్స్ తయారు చేసే పనివారిని భవన నిర్మాణ కార్మికుడుగా గుర్తించి కార్డు ఇవ్వనున్నారు. కార్మికుడికి 18 నుంచి 60 ఏళ్లు ఉండాలి. కనీసం 90 రోజులు నిర్మాణ రంగంలో పని చేసి ఉండాలి.

గుర్తింపు కార్డుతో ప్రయోజనాలు

- భవన నిర్మాణ కార్మికుడిగా గుర్తింపు కార్డు కలిగిన వారికి ప్రభుత్వం అనేక ప్రయోజనాలు కల్పించనుంది.
- మహిళా కార్మికురాలు/కార్మికుని భార్య/కార్మికుని కుమార్తె ప్రసూతి సాయం కింద రెండు కాన్పుల వరకు ఒక్కో కాన్పుకు రూ.20 వేలు అందజేస్తారు.
- వైఎస్సార్ పెళ్లి కానుకకు అర్హత లేని సామాజిక వర్గానికి ఈ గుర్తింపు కార్డుతో రూ. 40 వేలు సాయం చేస్తారు.
- కార్మికునిగా గుర్తింపు కార్డు ఉంటే ప్రమాదశాత్తు మరణిస్తే అతని కుటుంబానికి రూ.5 లక్షలు అందజేస్తారు.
- కార్మికుడు/కార్మికురాలు సహజంగా మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక సాయం కింద రూ.60 వేలు అందుతుంది.
- కార్మికుని దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఇస్తారు.
- గుర్తింపు కార్డు లేకుండా పనిచేస్తూ ప్రమాదవశాత్తు 50% అంగవైకల్యం కలిగిన వారికి రూ.20 వేలు అందజేస్తారు. వీటితో పాటు కార్మికుల పిల్లలు చదువుతుంటే స్కాలర్‌షిప్‌లు అందజేస్తారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి



భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులందరికీ గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలి. దీని వలన కార్మికుడితో పాటు కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయి. వైఎస్సార్ బీమాలో అత్యధికంగా భవన నిర్మాణ కార్మికులు నమోదయ్యారు. వీరితో ఉపాధి వేతనదారులు ఉన్నారు. వారంతా భవన నిర్మాణ కార్మికునిగా గుర్తింపు చేసుకోవాలి. –రఘుపాత్రుని రాధాకుమారి, సహాయ కార్మికశాఖాధికారి, టెక్కలి

90 శాతం రాయితీపై డ్రిప్ యూనిట్లు



కేశవరాయునిపురంలో డ్రిప్ ఇరిగేషన్ యూనిట్లు పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావు

లావేరు: ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. లావేరు, కేశవరాయునిపురం, గోవిందపురం గ్రామాల్లో రైతుల పొలాల్లో వేసిన డ్రిప్ సిస్టమ్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 ఎకరాలు వరకూ భూములు ఉన్న రైతులకు 90 శాతం రాయితీపైన, 5 ఎకరాలు పైబడి ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 700 హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ యూనిట్ల కోసం సర్వే చేయగా 200 హెక్టార్లకు సంబంధించిన రైతులు డీడీలు ఇవ్వడంతో పిని లెక్స్ కంపెనీ ద్వారా మంజూరు చేశామన్నారు. అలాగే 5 ఎకరాల వరకూ భూములు ఉన్న రైతులకు 55 శాతం రాయితీపై, ఆ పైబడి భూములు ఉన్న రైతులకు 45 శాతం రాయితీపై స్ప్రింకర్లు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి గల రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరు, పెట్టుబడి ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఇంజనీర్ హరిప్రసాద్, కంపెనీ డీసీవో ఎ.నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జింకను వేటాడిన కేసులో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఫారెస్ట్ రేంజర్ రాజశేఖర్. పక్కన నిందితులు

పాతపట్నం: పాతపట్నం సమీపంలోని అంతరరాబ రిజర్వు ఫారెస్టులో కందకం వద్ద నీరు తాగడానికి వచ్చిన జింకకు ఉచ్చు వేసి హతమార్చిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని పాతపట్నం అటవీ శాఖాధికారి (ఫారెస్ట్ రేంజర్) రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పాతపట్నం ఫారెస్ట్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో అంతరాబ సమీపంలో ఈ నెల 9వ తేదీ రాత్రి కందకం వద్ద తాగునీటి కోసం జింకలు వచ్చాయి. ఆ ప్రదేశంలో ముగ్గురు వ్యక్తులు ఆటోకు చెందిన గేర్ క్లచ్ వైర్లు, తీగలు కట్టి ఉచ్చు ఏర్పాటు చేశారు. ఓ జింక అందులో చిక్కుకొని మృతి చెందింది. అటవీశాఖ సిబ్బంది రాత్రి 9 గంటల సమయంలో గస్తీ తిరుగుతుండగా ఉచ్చులో ఉన్న జింకను చూశారు. అక్కడే మఫ్టీ కాయగా.. కొంతసేపటికి వచ్చిన అచ్చుతాపురం గ్రామానికి చెందిన ఉర్జాన జోగారావు, సాద రమేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. అంతరాబ గ్రామానికి తెందిన అందాల వెంకటరావు పరారవ్వడంతో అతన్ని కూడా కొద్దిసమయం తర్వాత అరెస్ట్ చేశారు. ముగ్గురినీ టెక్కలి కోర్టుకు తరలించారు. కాగా, ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు దొరికితే ఒకరిని తప్పించారని అంతరాబ గ్రామానికి చెందిన కొందరు అటవీ కార్యాలయం వద్ద ఆరోపించారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులు స్పందించలేదు. కాగా, మృతిచెందిన జింకకు అటవీశాఖ కార్యాలయం ఆవరణలో పశుసంవర్ధశాఖ వైద్యుడు పి.అనిల్ కుమార్ పోస్టుమార్టం చేసి ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఖననం చేశారు. సమావేశంలో సెక్షన్ అధికారి జితేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చేయూతతో మహిళలకు ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న డీపీఎం రామ్మోహన్‌రావు

జలుమూరు: వైఎస్సార్ చేయూత ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెంది జీవనోపాధులు మరింత మెరుగుపరుచుకుంటున్నారని డీఆర్‌డీఏ డీపీఎం చింతాడ రామ్మోహన్‌రావు అన్నారు. శుక్రవారం జలుమూరు వెలుగు కార్యాలయంలో సీఎఫ్, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 1,79,250 మందికి లబ్ధి కలిగిందన్నారు. చేయూత ద్వారా మహిళలు చేస్తున్న వివిధ వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు తదితర వివరాలను కేంద్ర కార్యాలయానికి అప్‌లోడ్ చేసేందుకు సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీపీఎం(ఐబీ) మోహన్‌రావు, ఏరియా కోఆర్డినేటర్ కొండలరావు, ఏపీఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనుల పరిశీలన

హిరమండలం: వంశధార రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సూచించారు. వంశధార ఎస్ఈ డోల తిరుమలరావుతో కలసి ఆయన వంశధార జలాశయం పనులను శుక్రవారం పరిశీలించారు. అలాగే నదిపై నిర్మించనున్న ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూ సేకరణ వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం కోసం సబ్‌స్టేషన్ నిర్మాణానికి కొంత స్థలం సేకరించాల్సి ఉందని అధికారులు తెలిపారు. అనంతరం రిజర్వాయర్ స్పిల్‌వే పనులతో పాటు వంశధార నాగావళి అనుసంధానానికి ప్రధాన కాలువైన హెచ్ఎల్‌సీని పరిశీలించారు. పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామని, ఎత్తిపోతల పథకం, 87, 88 ప్యాకేజీల పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం కోసం రూ.25కోట్ల మేర ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణ, డీఈఈలు రవికాంత్, సురేష్, తహసీల్దార్ బి.మురళీమోహన్, ఏఈలు భరత్, వినోద్ తదితరులు ఉన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

ఎచ్చెర్ల క్యాంపస్: బాలలను పరిశ్రమలు, దుకాణాల యాజమాన్యాలు పనిలో పెట్టుకోవద్దని ఏహెచ్‌టీయూ ఏఎస్సై డి.రమణమూర్తి అన్నారు. ఎచ్చెర్లలో ఇటుక బట్టీలు, దుకాణాలు, పరిశ్రమల్లో శుక్రవారం చైల్డ్‌లైన్, పోలీస్, రెవెన్యూ శాఖల సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులు ఉంటే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలు కనిపించకపోతే తల్లిదండ్రులు తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. 1090 చైల్డ్ లైన్, క్రైం స్టాపర్ 100 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు అనర్థమని చెప్పారు.

ఎడ్లబండిపై ఉత్సవమూర్తులు



లావేరు మండలం బెజ్జిపురంలో ఉమారామలింగేశ్వర పంచాయతన దేవస్థానం 6వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ఎడ్లబండిపై ఉంచి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. – లావేరు

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రాక్టికల్స్



ఎన్‌సీసీ క్యాడెట్ల ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న కల్నల్ నౌతియాల్, ఇతర అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) బీ– సర్టిఫికెట్ అభ్యర్థులకు ప్రతిభా ప్రావీణ్యత పరీక్షలు మొదలయ్యాయి. 14వ ఆంధ్రా బెటాలియన్ శ్రీకాకుళం యూనిట్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయి. వాస్తవానికి రెండు రోజులపాటు ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉండగా శనివారం రిజర్వ్‌డేగా ఉంచాలని అధికారులు నిర్ణయించారు. ఆదివారం ఇదే కళాశాల కేంద్రంగా థియరీ పరీక్ష జరగనుందని ఎన్‌సీసీ అధికారులు పేర్కొన్నారు.

ముగ్గురు గైర్హాజరు..

ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ కోసం ఏడాది కాలంగా సంసిద్ధమైన క్యాడెట్లకు శుక్రవారం పలు విభాగాల్లో ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించారు. రెగ్యులర్ క్యాడెట్లు 367 మందికి ఇద్దరు, సప్లమెంటరీ క్యాడెట్లు 12 మందికి ఒకరు గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్‌లో మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, ఫుట్‌డ్రిల్, కమ్యూనికేషన్ తదితర అంశాల్లో క్యాడెట్ల ప్రావీణ్యతను అంచనా వేసే పరీక్షలు నిర్వహించారు. మొత్తం 500 మార్కులకుగాను ప్రాక్టికల్స్‌కు 135, థియరీ పరీక్షలకు 365 మార్కులు కేటాయించనున్న విషయం తెలిసిందే. 2వ ఆంధ్రా బాలికల బెటాలియన్ నుంచి కల్నల్ నౌతియాల్ ఆధ్వర్యంలో ప్రాక్టికల్ పరీక్షలు పారదర్శకంగా జరిగాయి. 14వ ఆంధ్రా బెటాలియన్ కామాండింగ్ ఆఫీసర్ అమిత్ బెనర్జీ, సుబేదార్ మేజర్ గిరీష్, పలువురు హవల్దార్లు, లెఫ్టనెంట్ డాక్టర్ వై.పోలినాయుడు, కెప్టెన్ వంగా మహేష్, ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లకిలో పెళ్లికూతురు..!



వివాహ వేడుకలో వధూవరుల ఊరేగింపు ఆనవాయితీగా వస్తోంది. ఒకప్పుడు పెళ్లికూతురిని సంప్రదాయ పద్ధతిలో పల్లకిలో తీసుకొచ్చేవారు. మారుతున్న సంప్రదాయాల వల్ల పల్లికిలు దాదాపు కనుమరుగయ్యాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా అక్కడక్కడా పల్లకిలు దర్శనమిస్తున్నాయి. జి.సిగడాం మండలం ఎందువ, ఆనందపురం గ్రామాల్లో శుక్రవారం పల్లకిలో వధువులను ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆకట్టుకుంది. – జి.సిగడాం


అర్ధరాత్రి మృత్యుకేళి

- వెంకోజీపాలెం కూడలిలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఘటనా స్థలిలోనే ముగ్గురు యువకుల దుర్మరణం



ప్రమాద స్థలంలో మృతదేహాలు







మృతులు గోపి, సాయి, దుర్గాప్రసాద్ (ఫైల్)


అర్ధరాత్రి వేళ మృత్యుదేవత పంజా విసిరింది... ఘోర రోడ్డు ప్రమాదం రూపంలో ముగ్గురిని బలి తీసుకుంది. ఎండాడ నుంచి మద్దిలపాలెం వైపు బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదానికి గురై ఘటనా స్థలిలోనే ప్రాణాలు విడిచారు. రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు చూపరుల హృదయాలను కలచివేశాయి. చేతికి అందొచ్చిన కుమారులు చనిపోవడంతో వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తీవ్ర విషాదం నింపిన ఈ దుర్ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఎంవీపీ కాలనీ/ ఎల్.ఎన్.పేట : ఎంజాయ్ ఎవ్రీ మూవ్‌మెంట్... 'డెత్ ఈజ్ అన్ ఎక్స్‌పెక్టెడ్' అంటూ బైక్‌పై ఆ యువకులు రాయించుకున్న కొటేషన్ వారు మరణించిన తీరుకు అద్దం పట్టింది. జీవితాన్ని ఆస్వాదించాలని ఆకాంక్షించే యువత జీవన విధానంలో పాటించాల్సిన జాగ్రత్తలనూ గుర్తు చేసింది. వెంకోజీపాలెం కూడలిలో గురువారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం నగరంలో తీవ్ర విషాదం నింపింది. గురువారం అర్ధరాత్రి 1.30 సమయంలో ముగ్గురు యువకులు ఈ కూడలి వద్ద ప్రమాదానికి గురయ్యారు. హనుమంతవాక వైపు నుంచి మద్దిలపాలెం వైపు వస్తూ ఈ ప్రమాదానికి గురైనట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రమాదానికి గురైన ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందగా, వారి మృతదేహాలు చెల్లాచెదురుగా పడివున్నాయి. బైక్ కుడి వైపు భాగం మాత్రమే పూర్తిగా దెబ్బతినడంతోపాటు సమీపంలో ఒక కుక్క కూడా చనిపోయి ఉంది. దీంతో ఈ ప్రమాదం ఎలా జరిగి ఉంటుందనే అంశాన్ని నగర పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఏదైనా వాహనం వెనుక నుంచి ఢీకొట్టిందా..? లేక సెల్ఫ్ యాక్సిడెంట్ జరిగి ఉంటుందా..?.. ఈ ప్రమాదానికి చనిపోయిన కుక్క కూడా కారణం అయి ఉంటుందా..? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డీసీపీ సునీల్ సుమిత్ గరుడ్‌తోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటన జరిగిన వెంకోజీపాలెం కూడలితోపాటు ఆ మార్గంలోని పలు చోట్ల సీసీ కెమెరా ఫుటేజ్‌ని పరిశీలించినట్లు ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఘటన స్థలంలో సీసీ కెమెరా ఫుటేజ్ అస్పష్టంగా వుండటంతో మరింత డేటాను విశ్లేషిస్తున్నట్లు తెలిపారు.

అతివేగమే కారణమైందా..?

ఈ ఘటనలో రొంగలి గోపి (21), పీతల సాయి (21), దుర్గాప్రసాద్ (22)మృతి చెందారు. వీరిలో గోపి, సాయి ఎండాడ ప్రాంతానికి చెందిన వారు కాగా దుర్గాప్రసాద్ శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్ పేట మండలం శ్యామలాపురం గ్రామానికి చెందిన వాడు. దుర్గా ప్రసాద్ గీతం యూనివర్సిటీలో చదువుతుండగా గోపి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరు ముగ్గురు స్నేహితులు. గురువారం అర్ధరాత్రి దుర్గాప్రసాద్ రూమ్‌కి గోపి, సాయి వెళ్లి బయటకు రావాలని కోరారు. అనంతరం ముగ్గురు కలిసి బైక్‌పై ఎండాడ నుంచి మద్దిలపాలెం వైపు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రాత్రి 1.30, 2 గంటల మధ్య ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లగా అప్పటికే ఆ ముగ్గురు మృతి చెందారు. దీంతో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం వారి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అయితే తొలుత వెనుక నుంచి ఏదైనా వాహనం వీరిని ఢీకొట్టి వెళ్లిపోవడంతోనే ఈ ప్రమాదం జరిగి వుంటుందని పోలీసులు భావించినప్పటికీ అందుకు అనుగుణమైన ఆధారాలు లభించలేదని వెల్లడించారు. బైక్ కుడి వైపున మాత్రమే డ్యామేజ్ అవ్వడం, మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉండటంతో అతివేగం కూడా ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. అయితే సీసీ కెమెరా ఫుటేజ్‌ను పూర్తిస్థాయిలో విశ్లేషించడంతోపాటు పోస్టుమార్టం రిపోర్ట్ వస్తే తప్ప ప్రమాద కారణాలను పూర్తిస్థాయిలో వెల్లడించలేమని ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

కన్నీటి నివాళి



తుర్కియే(టర్కీ), సిరియా దేశాల్లో సంభవించిన భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. రోజూ వందల సంఖ్యలో మృతదేహాలు బయటపడుతున్నాయి. ఈ విపత్తులో మృతి చెందిన వారికి ఆత్మశాంతి కలగాలని, బాధితులను ఆదుకోవాలని కోరుతూ గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ శుక్రవారం సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు. – ఆమదాలవలస రూరల్

వాసుదేవ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

మందస: మందసలోని వాసుదేవ పెరుమాళ్ 14వ బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు గోపీనంబాళ్ల దాసుకూర్మాచార్యులు పర్యవేక్షణలో వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ దాసాంజనేయునికి అభిషేకం, ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ క్రతు వు కూడా నిర్వహించారు. యజ్ఞం నిర్వహణకు యాగశాలను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, తీర్థగోష్టి జరిగింది. రంగు, రంగుల విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఆలయం సమీపంలో, కొత్తవీధిలో తాత్కాలిక అంగడిలు వెలిశాయి. కొత్తవీధిలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు.